ప్రజాశక్తి
శుక్రవారం 28 జూన్ 2024
5
అనంతపురం



బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో మే-2024లో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20), మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని విడుదల చేశారు. విద్యార్థులు వారి పరీక్ష ఫలితాల కోసం కళాశాల అకడిమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని ప్రినిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణ కాంతి , డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్స్ డాక్టర్ డి.విష్ణు వర్ధన్, డాక్టర్ డి.లలిత కుమారి వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ కళ్యాణి రాధ , డాక్టర్ ఎం.రామ శేఖరరెడ్డి, డాక్టర్ జి.మమత, అజిత పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. వెలగపూడి ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం నాడు పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. జూలై 1వ తేదీన పింఛన్ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్ డ్రా చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా 50 హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ చేపటాల్సి ఉందని, శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీ కోసం అవసరమైన అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని డీఆర్డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ అడ్మిన్ అసిస్టెంట్ అజంతుల్లా పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేశారు. అందరి సమక్షంలో ఆయా ఈవీఎం గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

జిల్లాలోని నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల పరిధిలో ప్రభుత్వ అభివద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అన్నా క్యాంటీన్లు, అభివద్ధి పనులు, మొక్కల పెంపకం తదితర అంశాలపై ఆర్డీఎంఏ, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ పని అప్పజెప్పినా అభివద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో 9 అన్నా క్యాంటీన్లు మంజూరు కాగా, ఆరు నిర్మాణం పూర్తి చేసుకోగా, ఒకటి పామిడిలో ఉందని, రెండు పూర్తి కాలేదని వెంటనే పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ఉన్న క్యాంటీన్లకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. హరిత అనంతలో భాగంగా మున్సిపాల్టీల మొక్కల పెంపకం మొదలుపెట్టాలన్నారు. ప్రతి ఇంటి ముందు చెట్టు ఉండాలన్నారు. అంతకుముందు కలెక్టర్ నగరంలోని గుత్తి రోడ్‌లో కనకదాస సర్కిల్లో అన్నా క్యాంటీన్‌ని చేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ పివిఎస్ఎన్.మూర్తి, మున్సిపల్ కమిషనర్లు కిషోర్, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, నరసారెడ్డి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో అధికారం మారింది. వైసిపి ప్రభుత్వం ఘోరంగా ఓటమిని చవిచూసింది. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లోని పాలకవర్గాల్లో మార్పులు, చేర్పులు కనిపిస్తున్నాయి. అధికారపార్టీ వైపునకు వలసలు పెరుగుతున్నాయి. ప్రధానంగా పురపాలక సంఘాల్లో ఎక్కువగా వలసలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో తాడిపత్రి మినహా అన్ని మున్సిపాల్టీలు వైసిపి చేతిలోనే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో మున్సిపాల్టీల ఛైర్మన్ కుర్చీ కూడా కదిలేలా కన్పిస్తోంది. మెజార్టీ కౌన్సిలర్లు అధికార టిడిపి కండువా కప్పుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.



మారుతారా. మార్చేస్తారా..?

- స్థానిక సంస్థల్లో మార్పులు-చేర్పులు..!
- పురపాలక సంఘాల్లో మొదలైన వలసలు
- పాలకవర్గాల్లోనూ మార్పులకు అవకాశం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా 2021లో వైసిపి అధికారంలో ఉన్న సమయంలోనే మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో రాష్ట్రంలో ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీ మినహా అన్నింటినీ వైసిపి కైవసం చేసుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు చూస్తే అనంతపురం నగర పాలక సంస్థతోపాటు మొత్తం 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో తాడిపత్రి ఒక్కటే టిడిపి పాలకవర్గముంది. అన్నీ కూడా వైసిపినే గెలుచుకుంది. ఇప్పుడు వైసిపి తరుపున గెలచిన కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్దం అవుతుండడంతో పాలకవర్గాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఒక్కసారి ఛైర్మన్‌గా ఎన్నికైన వారిని దింపాలంటే అవిశ్వాసం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవిశ్వాసం పెట్టాలంటే నాలుగు సంవత్సరాల కాలం వరకు వీల్లేదన్న నిబంధనలున్నాయి. నేరుగా ఛైర్మన్ పార్టీ మారితే పరిస్థితి భిన్నంగా ఉండే అవకాశముంది. అలా లేకపోతే అవిశ్వాసం పెట్టాలంటే మరో ఏడాది వేచి చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటికి మున్సిపల్ పాలకవర్గాలు ఏర్పాటై కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే అయ్యింది.



మడకశిరలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్న కౌన్సిలర్లు

మారుతున్న బలాబాలాలు

మున్సిపాల్టీల్లో బలాబలాలు మారుతున్నాయి. ప్రధానంగా మడకశిర మున్సిపాలిటీలో చూస్తే నలుగురు కౌన్సిలర్లు బుధవారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇక్కడ మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇది వరకు తెలుగుదేశం పార్టీ తరుపున గెలుపొందిన వారు ఐదుగురు ఉన్నారు. ఇప్పుడు చేరిన నలుగురితో కలిపి తెలుగుదేశం బలం తొమ్మిదికి చేరనుంది. ఇక ఎక్స్ అఫిసియోగా ఎమ్మెల్యే ఓటు కలిపి పదికి చేరుతుంది. అంటే ఇద్దరి బలం సమానం కానుంది. మరోకరు పార్టీ మారితే మడకశిర మున్సిపాలిటీలో వైసిపి ఛైర్మన్ పదవిని కోల్పోనుంది. కదిరిలోనూ ఎన్నికలకు ముందే ఐదుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. అప్పటికే అక్కడ టిడిపి తరుపున ఆరుగురున్నారు. ఇక్కడ మొత్తం 36 కౌన్సిలరు స్థానాలున్నాయి. ఎమ్మెల్యే ఓటు అదనంగా కలిసొస్తుంది. పాలకవర్గం మారాలంటే మొత్తం 19 మంది బలం ఇక్కడ ఉండాలి. మరికొంత మది కూడా త్వరలో పార్టీ మారే సూచనలున్నట్టు చర్చ నడుస్తోంది. ఇలా జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లోనూ పార్టీల మార్పులు జరుగుతున్నాయి. పాలకవర్గాల మార్పు జరగాలంటే అవిశ్వాసం పెట్టేందుకు సమయం ఏడాది ఉంది. అంతలోపు ఇంకెన్ని మార్పులు జరుగాయన్నది చూడాల్సి ఉంది.

ఎస్‌కె, జెఎన్‌టియు విసిల రాజీనామా

- ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖలు పంపినట్టు సమచారం
- ఒత్తిళ్లతోనే వైదొలిగిరా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఉన్న రెండు విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఇద్దరు వైస్ ఛాన్సలర్లు తమ పదవుల నుంచి తప్పుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు ఆ ఇద్దరు ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్ సెక్రటరీకి రాజీనామా లేఖలను పంపినట్టు తెలుస్తోంది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరుగా హుస్సేన్‌రెడ్డి, అనంతపురం జెఎన్‌టియుకి జివిఆర్.శ్రీనివాససరావు వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తూ జనవరి 17వ తేదీన అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సరిగ్గా ఆరుమాసాలు మాత్రమే వీరు నియమితులై ఉన్నారు. మూడు సంవత్సరాల పదివీకాలనీకి వీరిని నియమించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరు ఇక్కడి యూనివర్శిటీలోనే రసాయన శాస్త్రం విభాగాధిపతిగా ఉండేవారు. ఆయన్ను వైస్ ఛాన్సలరుగా నియమించారు. అనంతపురం జెఎన్‌టియుకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా ఉన్న శ్రీనివాసరావును నియమించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఘోర ఓటమిని చవిచూసింది. అత్యధికమైన మెజార్టీతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొలువుదీరిన వెంటనే ప్రక్షాళన మొదలు పెట్టింది. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో వారికి అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేస్తూ వస్తోంది. వీరిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. కావున ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు వచ్చినట్టు ఆరోపణలు వెళువెత్తుతున్నాయి. వైసిపి హయాంలో నియమితులైన ఇద్దరినీ రాజీనామా చేసి తప్పుకోవాలని సూచించడంతో ఇద్దరు వైస్ చాన్సలర్లు రాజీనామాలు చేసినట్టు తెలుస్తోంది. వీరితోపాటు రిజిస్ట్రార్లు కూడా పాతవారు తమ పదవుల నుంచి తప్పుకుంటూ రాజీనామా లేఖలు అందజేసినట్టు సమాచారం. అయితే దీనిపై అధికారికంగా యూనవర్శిటీ వర్గాలేవి ధ్రువీకరించలేదు.

డాక్టర్ నీలం విజయ్‌కుమార్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురానికి చెందిన డాక్టర్ నీలం విజయ్‌కుమార్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు నీలం రాజశేఖర్‌రెడ్డి కుమారుడు నీలం విజయ్‌కుమార్ అని తెలిపారు. నీలం విజయ్‌కుమారు అనంతపురం నగరంలో ప్రజా వైద్యుడుగా ఉంటూనే కమ్యూనిస్టు ఉద్యమానికి తనవంతు తోడ్పాటును అందిస్తూ వచ్చేవారని తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృతికి సిపిఎం సంతాపాన్ని తెలియజేస్తున్నట్టు తెలియజేశారు.

'లీజు ప్రాతిపదికనే టిడిపి కార్యాలయాలు' : వైసిపి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలను లీజుకు తీసుకున్నారని చెబుతున్న టిడిపి నాయకులు వారి పార్టీ కార్యాలయాలకు కూడా లీజు ప్రాతిపదికనే ప్రభుత్వ స్థలాలు తీసుకున్నారని వైసిపి నాయ కులు తెలిపారు. అనంతపురం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా అద్యక్షుడు పైలా నరసింహయ్య, నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి నాయకులు తమ పార్టీ కార్యాలయాలను ప్యాలెస్‌లుగా వర్ణిస్తున్నారని, అయితే వారి కార్యాలయా లు పూరి గుడిసెలా అని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలకు తగిన అపరాధ రుసుము విధిస్తే సరిపోతుందని అలా కాకుండా కూల్చాలని చూడడం సరికాదన్నారు. ఒక పార్టీ నాయకులు మరో పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం సరికాదన్నారు. స్వాధీనం చేసుకుంటామని చెప్పడం సరికాదని హితువు పలికారు. కొన్ని చోట్ల నిర్మాణాలకు ట్యాక్స్ కూడా పే చేశామని తెలిపారు.

చిరుత దాడిలో ఆవుదూడ మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామ సమీపంలో గురువారం వేకువ జామున ఓ చిరుత ఆవుదూడపై దాడి చేసి చంపి తినింది. గ్రామానికి చెందిన రైతు రాజు గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలంలోని పాకలో రోజూ మాదిరిగానే పశువులను కట్టివేశాడు. ఉదయం రాజు పొలానికి వచ్చి చూసేసరికి దూడను చిరుత చంపినట్లు గుర్తించాడు. రైతు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిపారు.

అలసత్వం చూపేవారికే అందలం..!

శానిటరీ ఇన్స్‌పెక్టర్ పోస్టు నియామకంలో పైరవీలు - రూ.70 వేలు చేతులు మారినట్లు ప్రచారం..?

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ పోస్టుల భర్తీలో వేల రూపాయలు చేతులు మారాయనే విమర్శలు ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఒక్కో పోస్టుకు రూ.70 వేలు మారాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తగ్గట్టుగానే గతంలో విధి నిర్వహణలో అలసత్వం వహించిన వ్యక్తులకే తిరిగి శానిటరీ ఇన్స్‌ప్పెక్టర్ పోస్టులు అప్ప చెప్పటం చూస్తే ఉద్యోగ వర్గాల్లో జరుగుతున్న చర్చకు వాస్తవమే అన్న బలం చేకూరుతోంది. మూడవ సర్కిల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ను విధినిర్వహణలో అలసత్వం అశ్రద్ధ చూపుతున్నారన్న ఫిర్యాదులపై స్పందించి అప్పటి కమిషనర్ భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో అతిపెద్ద సర్కిల్ అయిన మూడవ సర్కిల్లో వాణిజ్య సముదాయాలు మొదలుకుని కమలానగర్ నుంచి నాయక్ నగర్ వరకు పరిధి విస్తరించి ఉంది. అంతటి కీలకమైన మూడో సర్కిల్‌కు వెంకటేష్‌ను తిరిగి ఏ ప్రాతిపదికన నియమించారనే ప్రశ్న ఆ శాఖ ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది. అప్పట్లో వెంకటేష్‌ను నాలుగో సర్కిల్‌కు మార్చారు. ఐదవ సర్కిల్లో పనిచేస్తున్న రెగ్యులర్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు మూడో సర్కిల్‌కు మారుస్తూ అప్పటిప కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలిచ్చారు. కీలకమైన ప్రాంతాల్లో రెగ్యులర్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను నియమించకుండా పిహెచ్ మేస్త్రీలను సర్కిళ్లకు శానిటరీ ఇన్స్‌పెక్టర్లుగా నియమించటం కార్పొరేషన్ అధికారులకు పరిపాటిగా మారింది. ఇటీవల హెల్త్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన విష్ణుమూర్తి ఒకటవ సర్కిల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పెన్నోబులేసు, నాలుగో సర్కిల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేష్‌ను తిరిగి పిహెచ్ మేస్త్రీలుగా పంపారు. ఈ నాలుగు రోజుల్లో ఏ మతలబు జరిగిందో ఏమోగానీ నగరంలో అతిపెద్ద సర్కిల్ అయినా మూడో సర్కిల్‌కు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా వెంకటేష్‌ను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. మూడో సర్కిల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులును ఐదో సర్కిల్‌కు బదిలీ చేశారు. సీనియర్ రెగ్యులర్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను తిరిగి 5వ సర్కిల్‌కు బదిలీ చేయడంలో అంతరార్థం ఏమిటన్న దానిపై ఇప్పుడు కార్పొరేషన్‌లో చర్చ నడుస్తోంది. పిహెచ్ మేస్త్రి పాల్‌రాజును ఆరవ సర్కిల్ సెంటర్ ఇన్స్‌పెక్టర్‌గా మార్చారు. మూడవ సర్కిల్ పిహెచ్ మేస్త్రి నల్లప్పను నాలుగో సర్కిల్ సెంటర్ ఇన్స్‌పెక్టర్‌గా నియమించారు. పెన్నోబులేసును జనన మరణ రిజిస్ట్రేషన్ విభాగంలో హెల్త్ అసిస్టెంట్‌గా నియమించారు. ఈ నియామకం పట్ల అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే విభాగంలో ఎక్కువమంది పనిచేస్తుండగా అదనంగా పిహెచ్ మేస్త్రిని పెన్నోబిలేసు విభాగానికి కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నగరంలో సర్కిళ్ల వారీగా హెల్త్ అసిస్టెంట్ ఉండగా అదనంగా రికార్డులు నిర్వహణ పేరుతో పెన్నోబులేసును వేయటం సరికాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదే అంశాన్ని గురువారం నాడు ఏఎస్‌వో ప్రవీణ్ కుమార్ కమిషనర్ మేఘ స్వరూప్ దష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. నగరంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ల పనితీరు ఎలాగుంది.. ఏ సర్కిల్లో ఎలాంటి పనితీరు చూపుతున్నారు..? తదితర అంశా లపై అవగాహన ఉన్న కమిషనర్ ఈ బదిలీ ఉత్తర్వులు పరిశీలించకుండానే గుడ్డిగా సంతకాలు చేశారా అంటూ ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం బదిలీల అంశంలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో కొంతకాలం క్రితం హెల్త్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి ప్రతిపాదించిన బదిలీలను కమిషనర్ మేఘ స్వరూప్ పరిశీలించి విమర్శలకు తావు లేకుండా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

గురుకులంలో డయేరియా తగ్గుముఖం



గురుకుల పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గత రెండు రోజులుగా ప్రబలిన డయేరియా వ్యాధి తగ్గుముఖం పట్టింది. బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ దేవేంద్ర నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు లాజరస్, ఆంజనేయులు, ఎఎన్ఎంలు విద్యార్థినులకు చికిత్స చేయడంతో వ్యాధి తగ్గుముఖం పట్టింది. గురువారం ఒక విద్యార్థిని మాత్రమే అస్వస్థతకు గురి కావడంతో వైద్యులు పరీక్షించి చికిత్స చేశారు. ఆహారం, తాగునీరు శాంపిళ్లను పరీక్షల నిమిత్తం పంపించినట్లు వైద్యులు తెలిపారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పాఠశాలను సందర్శించారు. భోజనశాల, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తెస్తే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు చెప్పి పరిష్కరిస్తామన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో ఫస్ట్ వచ్చిన విద్యార్థినికి గుమ్మనూరు నారాయణ రూ.50 వేలు, సెకండ్ వచ్చిన విద్యార్థినికి గుత్తి ఆర్ఎస్ వర్ధన్ ఇంటిరీయర్ యజమాని, టిడిపి నాయకుడు సల్మాన్ రాజా రూ.25 వేలు, పాఠశాల స్థాయిలో ఫస్ట్ వచ్చిన విద్యార్థినికి గుమ్మనూరు నారాయణ రూ.15 వేలు, సెకండ్ వచ్చిన విద్యార్థినికి టిడిపి నాయకుడు ఎంకె.చౌదరి రూ.10 వేలు, థర్డ్ వచ్చిన విద్యార్థినికి టిడిపి నాయకుడు చెలుకూరి లక్ష్మణ్ రూ.5వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఎంపిపి జి.విశాలాక్షి, తహశీల్దార్ బి.భారతి, గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జె.నారాయణస్వామి, సర్పంచి యు.లింగమయ్య, టిడిపి నాయకులు కరిడికొండ సూరి, మాజీ కౌన్సిలర్ సురేష్ బాబు. ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన సిపిఎం

మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు గురువారం సందర్శించారు. రెండు రోజులుగా విద్యార్థినులు డయేరియాకు గురై చికిత్సలు తీసుకుంటున్న నేపథ్యంలో నాయకులు పాఠశాలను సందర్శించి పరిశీలించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి శివరావు, జిల్లా కోఆర్డినేటర్ మురళీకష్ణ, ప్రిన్సిపాల్ ఉషారాణిలతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్ మాట్లాడుతూ పాఠశాలలోని కలుషితనీరు తాగి విద్యార్థినులు డయేరియాకు గురయ్యారని అన్నారు. దాదాపు 620 మంది విద్యార్థినులు ఉన్న పాఠశాలలో ఇద్దరే పారిశుధ్య కార్మికులను నియమించడం ఎంతవరకు సంజసం అని ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం ఉడకని పచ్చి చికెన్ విద్యార్థినులకు వడ్డించడంతో అస్వస్థకు గురైనట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. విద్యార్థినులకు సురక్షితమైన మంచినీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేంద్ర, రాజేష్, బాలాజీ, ధన, వినయ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోలీసుల సేవలు అద్భుతం : డిఐజి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్క పోలీసు సిబ్బందికి కతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి, ఎస్పీ గౌతమిసాలి తెలిపారు. నామినేషన్ల ఘట్టం, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన హోంగార్డుల నుంచి పోలీసు అధికారుల వరకు అందరికీ ప్రశంసా పత్రాలు, రివార్డులను గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. అనంతరం పోలీసు కన్వెన్షన్ హాల్లో డీఐజీ, ఎస్పీ స్వయంగా సిబ్బందికి భోజనం వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ తాడిపత్రి ఘటన మినహా యావత్తు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగించడం సమిష్టి కషి ఫలితమేనని వెల్లడించారు. మున్ముందు ఇదే స్ఫూర్తి కొనసాగించి జిల్లాను ప్రశాంతంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. ప్రజలతో మమేకమై మర్యాదగా వ్యవహరించడంతో పాటు పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందేలా ప్రతిఒక్కరూ కషి చేద్దామని పిలుపునిచ్చారు. హోదాలు మరిచి సమిష్టిగా పని చేయడమే కాకుండా పరస్పరం గౌరవించుకుందామని పోలీసు సిబ్బందిని కోరారు.

వేరుశనగ సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి : జెడిఎ

అనంతపురం : వేరుశనగ పంట సాగులో రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. నగర శివారులోని ఎ.నారాయణపురం గ్రామం రైతు భరోసా కేంద్రంలో గురువారం అనంతపురం ఎడిఎ ఎం.రవి అధ్యక్షతన ఎఒ జె.శశికళ ఆధ్వర్యంలో 'సాగుకు సమాయత్తం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడిఎ యు.ఉమామహేశ్వరమ్మ, విశిష్ట అతిథిగా రేకులకుంట పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు గారు హాజరై రైతులు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలకుమారి, వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, టెక్నికల్ వ్యవసాయ అధికారి బాలునాయక్, వ్యవసాయ విస్తరణ అధికారులు బి.మురళీకృష్ణ, అలేఖ్య, శిరీష, మండలంలోని అన్ని ఆర్‌బికెల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత : ఎస్పీ



సమీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

శాంతి, భద్రతల పరిరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించాలని ఎస్పీ గౌతమిసాలి పిలుపునిచ్చారు. జిల్లాలోని పోలీసు, సెబ్ విభాగం అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. జిల్లాలో నమోదైన ఎంసిసి కేసులు, పోక్సో, గ్రేవ్ యూఐ, ఎస్సీ ఎస్టీ, మహిళలపై జరిగిన నేరాలు, తదితర కేసులను సబ్ డివిజన్‌ల వారీగా సమీక్ష చేశారు. ఈ కేసుల్లో మరింత పురోగతి సాధించాలని ఎస్పీ సూచనలు చేశారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకుల కదలికలపై నిఘా వేయాలన్నారు. ప్రస్తుతం వారి తాజా సమాచారం, పరిస్థితులు, ప్రవర్తన తీరుపై ఆరా తీయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ గట్టి సంకల్పం, కార్యాచరణ ప్రణాళికతో రోడ్డు ప్రమాదాల కట్టడికి పని చేయాలని సూచించారు. ప్రాధాన్యత ప్రకారంగా వీటికి పరిష్కారం ఎలా చూపాలో తెలియజేశారు. మట్కా, పేకాట, మత్తు పదార్థాలు, నాటుసారా, కట్టడి పక్కాగా ఉండాలని, జిల్లాలో ఎక్కడ జూదం జరిగినా సహించబోమని హెచ్చరించారు. ఎవరైనా ప్రోత్సహించినా, సంబంధాలు కొనసాగించినా చర్యలు తప్పవన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ పెంచాలన్నారు. బేసిక్ పోలీసులో భాగంగా డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పెట్టీ కేసులపై దష్టి సారించాలన్నారు. రికార్డుల నిర్వహణ మంచిగా ఉండాలన్నారు. పేకాట, నాటుసారా, కర్నాటక లిక్కర్‌పై దాడులకు వెళ్లిన సందర్భాలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రకతి వైపరీత్యాలు, విఐపిల భద్రత, సంచలనాత్మక నేరాలు జరిగిన సమయాల్లో పోలీసులు ఏమి చేయాలో ఎస్పీ దిశానిర్ధేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు ఎం.ఆంథోనప్ప, టివివి.ప్రతాప్, బి.శ్రీనివాసులు, శివభాస్కర్ రెడ్డి, మునిరాజతో పాటు పోలీసు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రం తనిఖీ

శింగనమల : మండలంలోని సి.బండమీదపల్లి గ్రామంలో ఉన్న స్వర్ణ భూమి ఫర్టిలైజర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. లైసెన్స్, మెటీరియల్, స్టాక్, సేల్స్, ల్యాబ్ రిజిస్టర్లు, ల్యాబ్ తయారీ మెషినరీ, గోడౌన్‌ని తనిఖీ చేశారు. ఎరువుల తయారీకి సంబంధించి ప్రతి నెలా స్టాక్ రిపోర్ట్ తప్పకుండా ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించా రు. ఆమె వెంట టెక్నికల్ ఎఒ బాలానాయక్, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్, సి.బండమీదపల్లి ఆర్‌బికె విహెచ్ఎ కె.అమరేశ్ ఉన్నారు.



శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, తదితరులు

శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో గురువారం అసోసియేట్ డీన్ డా. ఎస్.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులను ఆహ్వానించారు. ముఖ్య అతిథులుగా శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ డా. పల్లె కిషోర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ టి.ఎస్. శివానంద హాజరయ్యారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ నిషేధం అని, ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడవద్దని విద్యార్థులకు తెలిపారు. ప్రముఖులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ నాలుగేళ్లు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. హార్టికల్చర్ కోర్సుకు చాలా డిమాండ్ ఉండటం వల్ల రాబోయే రోజుల్లో అనంతపురం జిల్లా హార్టికల్చర్ హబ్‌గా ఉంటుందని, దీని వల్ల ఉద్యోగావకాశాలు మంచిగా ఉంటాయని తెలిపారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.



డయేరియాపై అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు

డయేరియాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

మండలంలోని పెద్దపుడమల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుమన్ మాట్లాడుతూ డయేరియా ఎలా వ్యాపిస్తుంది, ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలపై ప్రజలకు వివరించాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వస్తుందని, ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు 14 రోజులు తీసుకోవడం ద్వారా నయం చేసుకోవచ్చునని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అతిసార, విరేచనాలు, వాంతులు అయితే తక్షణమే సమీపంలోని ఆసుపత్రిలో వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. డెయేరియా వల్ల ప్రాణాపాయస్థితి కూడా ఉంటుందని హెచ్చరించారు. సదస్సులో డాక్టర్ యశస్విని, హెల్త్ సూపర్వైజర్లు, ఎంపీడీవో కార్యాలయ ఏవో వాసుదేవరెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్ కల్పన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, వెంకటరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యుస్ ఎఇ ఐజయ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ బృందానికి ఎస్పీ ప్రశంసలు

నార్పల : నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గురువారం జిల్లా ఎస్పీ గౌతమిశాలి నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. నార్పలలో ఇటీవల సంచలనంగా మారిన చిన్నారి పావని అదృశ్యం కేసును ఎస్ఐ తన బందంతో కలిసి చాకచక్యంగా తమదైన శైలిలో విచారణ చేసి రెండు రోజుల్లోనే ఛేదించారు. చిన్నారి తండ్రి గణేష్‌ను హంతకుడిగా తేల్చి అరెస్టు చేశారు. దీంతో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డితో పాటు పోలీసు బృందానికి ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ

పామిడి : స్థానిక టంగుటూరి చిన్నప్ప శ్రేష్టి ఉన్నత పాఠశాలలో గురువారం పంజాబీ డాబా యజమాని తేజేంద్రనాథ్‌సింగ్ పుట్టినరోజు సందర్భంగా 200 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గౌస్ బాషా తెలిపారు. మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బిబిఎ, బిసిఎ కోర్సులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ కోర్సులతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి బ్యాచిలర ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్(బిబిఎ), బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్(బిసిఎ) కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిబిఎ, బిసిఎ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి లభించినట్లు తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ హానర్స్ కోర్సులకు కూడా అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌కు సన్మానం

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎపిఐఐసి) అనంతపురం జోనల్ మేనేజర్ చింతా నాగార్జునను గురువారం జనసేన పార్టీ నాయకులు పేరూరు శ్రీనివాసులు నగరంలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెన్నెల కృష్ణ, బండమీదపల్లి గోపాల్, జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జనసేన వీర మహిళ పేరూరు మహాలక్ష్మి, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం

అనంతపురం : నగరంలోని ప్రసాద్, లలిత దంపతుల కుమారుడు సాగర్ ఉన్నత విద్య కోసం గురువారం అమ్మ సంస్థ అధ్యక్షులు రమణారెడ్డి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్నారు. రమణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది నిరుపేద విద్యార్థులు మంచి మార్కులు, ర్యాంకులు సాధించి నా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని, అలాంటి వారికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సాగర్‌కు భవిష్యత్తులో కూడా అమ్మ సంస్థ తరపున సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

హోటల్ యజమానులకు నోటీసులు

కళ్యాణదుర్గం : పట్టణంలోని హోటల్ నిర్వాహకులకు గురువారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామారావు నోటీసులు జారీ చేశారు. ఆయన పట్టణంలోని వివిధ హోటళ్లను సందర్శించి భోజనం నాణ్యత, బాల కార్మికుల గుర్తింపు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యతలేని భోజనం అందజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వివిధ హోటళ్ల యజమానులకు నోటీసులు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుడికి పరామర్శ

అనంతపురం : ప్రమాదంలో కాలు విరిగిన భవన నిర్మాణ కార్మికుడు నరసింహారెడ్డి(42) నగరంలోని సాయినగర్‌లో ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా గురువారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల మేరకు టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంజుల నారాయణ, నగర నాయకులు రామాంజి పరామర్శించారు. కార్మిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూస్తామని వారు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే 'కాలవ'కు ఆర్యవైశ్య సంఘం సన్మానం

రాయదుర్గం : స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాల వల్లే ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు తెలిపారు. గొప్ప కార్యదక్షత, అపార పరిపాలన అనుభవం ఉన్న సిఎం చంద్రబాబు ఎపిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, మహిళా మండలి, ఆవోపా ఉద్యోగులు, వర్తకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అధికారులను హెచ్చరించారు. గత ఐదేళ్లలో నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనుకబడిందని, అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శాఖల వారీగా సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా. పార్టీలకు అతీతంగా పని చేస్తా, ఉద్యోగులు కూడా అలాగే పని చేయాలని, ముఖ్యంగా అవినీతికి తావు లేకుండా పరిపాలన ఉండాలని కోరారు. కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ వారి సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. విధులు భారంగా భావించే అధికారులు బదిలీ చేయించుకుని వెళ్లిపోవచ్చు అన్నారు. వైద్య, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పథకం పింఛను పెంపు కింద జులై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను దారులకు రూ. 7వేల చొప్పున పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ యోగేశ్వరి, తహశీల్దార్ శోభన్ బాబు, ఎంపీడీవో రమణ, ఏవో అనేష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీనివాసులు, విద్యుత్ ఎఇ విజయ్ కుమార్, ఎంఇఒ నరసింహరాజు, సిడిపిఒ ఉమా శంకరమ్మ, ఎపిఒ శ్రీదేవి, వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-నార్పల

మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిహెచ్ఒ బాలాజీ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలలో గురువారం మండలంలోని ఆశా కార్యకర్తలకు నెల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సిహెచ్ఒ మాట్లాడుతూ డయేరియా ఏ విధంగా ప్రబలుతుందో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారను. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు కాచి చల్లార్చిన తర్వాత తాగాలని, ఈగలు, దోమలు వాలిన ఆహార పదార్థాలు తీసుకోకూడదని వివరించాలన్నారు. వాంతులు, బేదులు వరుసగా రెండు మూడు రోజుల నుంచి అవుతూ ఉంటే వెంటనే సమీప వైద్యశాలలో సంప్రదించాలన్నారు. సమావేశంలో సూపర్వైజర్ అప్పులప్ప, ఎఎన్ఎం ప్రమీల, అక్షిత, సిబ్బంది ఎర్రిస్వామి, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

వైద్యశాలలో ఐయువి సెట్ల కొరత

స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ఇటీవల కాలంలో డయేరియా, తదితర రుగ్మతలతో వైద్యశాలకు వచ్చే వారికి సెలైన్ బాటిల్స్ ఎక్కించాలంటే ఐయువి సెట్లు అందుబాటులో లేవు. బయట నుంచి తెచ్చుకుంటున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వైద్యురాలు సాధియాను వివరణ కోరగా ఐయువి సెట్లు స్టాక్ అయిపోయాయని, త్వరలోనే వస్తాయని తెలిపారు.

బాలికల వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకొని గురువారం నగరంలోని బిసి ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల వసతి గృహం, ఎస్టీ, మైనారిటీ బాలికల వసతి గృహాల్లో అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో కీటక జనిత వ్యాధుల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు. ఆయా వసతి గృహాలను మున్సిపల్ ఆరోగ్య అధికారి(ఎంహెచ్ఒ) విష్ణుమూర్తి తనిఖీ చేశారు. ఎంహెచ్ఒ మాట్లాడుతూ గదుల్లోకి దోమలు రాకుండా మెస్ బిగించుకోవాలని, పిల్లలకు జ్వరం వస్తే వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని వసతి గృహ సంరక్షణ అధికారులకు సూచించారు. స్ప్రేయింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తరచూ వసతి గృహాలను సందర్శించి జ్వరాలు ఉన్నట్లయితే రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శికి సూచించారు. డెంగీ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో లార్వా, దోమల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. దోమల వల్ల కలిగే జబ్బుల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య, శానిటేషన్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, వసతి గృహ సంరక్షకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



బాలికల వసతి గృహాల్లో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

రామగిరి ఎగువతండాలో సర్వే

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని రామగిరి ఎగువతండాలో ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.వి.సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు సుధాకర్, ఉదయ్ కుమార్ ప్రజలను ప్రత్యేకంగా పరీక్షించి ఐదుగురు డయాబెటిస్ రోగులను గుర్తించారు. వారిలో ముగ్గురికి చికిత్స చేసి మరో ఇద్దరిని ప్రత్యేక చికిత్స కోసం ఎద్దులపల్లి పిహెచ్‌సికి సిఫారసు చేశారు. వైద్య శిబిరాన్ని ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి సందర్శించారు. అలాగే గ్రామంలో వీధి వీధిలో తిరిగి పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారి సుధాకర్, ఆరోగ్య సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి వారిచే గ్రామంలో హౌస్ టు హౌస్ సర్వే చేయించారు. ప్రతి ఇంటికీ క్లోరోఫిన్ టాబ్లెట్లు పంపిణీ చేయించడంతో పాటు 40 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. శిబిరంలో సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రామగిరి ఎగువతండాలో ఇంటింటి సర్వే చేపట్టిన సిబ్బంది

దివ్యాంగుల అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

దివ్యాంగుల అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేద్దామని సక్షం జిల్లా కార్యదర్శి కంబాల తిమ్మారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని రఘువీరా పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి దివ్యాంగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తిమ్మారెడ్డి మాట్లాడుతూ త్వరలో దివ్యాంగుల సేవా కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు, ఉద్యోగ రంగాల్లో ప్రతిభ చాటిన పలువురు దివ్యాంగులను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి దివ్యాంగుడు స్వశక్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేద్దామన్నారు. విద్య, వైద్య, ఉద్యోగ, తదితర రంగాల్లో ప్రగతి సాధించిన వారిని ప్రత్యేకంగా గుర్తించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, శ్రీరాములు, దాసరి బాలుయాదవ్, ఖాజా, రామకృష్ణ, శ్రీరామ్, లోకేష్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులను సన్మానిస్తున్న తిమ్మారెడ్డి

చిన్నముష్టూరులో వైద్యశిబిరం

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండలంలోని చిన్న ముష్టూరు గ్రామంలో గురువారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్ఞ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇతర గ్రామాల్లో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బందిని రప్పించి 3 బందాలుగా విడిపోయి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అతిసార కేసుల వివరాలు సేకరించారు. కేవలం ఒక వ్యక్తి అతిసారతో బాధపడుతున్నట్లు గుర్తించి ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సిహెచ్ఒ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి అతిసారపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రమణ గ్రామంలో తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్లు శేఖర్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర వెంకటేష్, సిహెచ్ఒలు హిమబిందు, భవాని, భారతి, ఎఎన్ఎంలు హేమలత, చాముండేశ్వరి, కోమల, అనూష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చిన్నముష్టూరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

నీటి ట్యాంకులు శుభ్రం

ప్రజాశక్తి-నార్పల

నార్పల మేజర్ పంచాయతీలోని తాగునీటి ట్యాంకులను గురువారం పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేశారు. ట్యాంకుల చుట్టూ ముళ్లపొదలను తొలగించారు. ఉయ్యాలకుంట జంగాల కాలనీలోని డ్రెయినేజీ కాలువల్లో స్ప్రే చేయించారు. సర్పంచి సుప్రియ, పంచాయతీ సెక్రటరీ అశ్వత్థమనాయుడు మాట్లాడుతూ గ్రామంలో డయేరియా, మలేరియా, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర కుమార్, సచివాలయ కార్యదర్శులు శ్రీనివాసులు, చరణ్, పరుశురాం, పంచాయతీ సిబ్బంది బాలాజీ నాయక్, శ్రీనివాసులు, రమేష్, రామాంజనేయులు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ హసన్‌బాషాని ఆదేశించారు. ఉరవకొండలో తాగునీటి ఎద్దడి నెలకొందని విజయవాడలో ఉన్న మంత్రికి తెలియడంతో స్పందించిన ఆయన వెంటనే కలెక్టర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలకు ఫోన్ చేశారు. దీంతో కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈకి ఫోన్ చేసి అందుబాటులో ఉన్న నిధులతో ఉరవకొండలో వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. పట్టణంలోని 21 వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వెంటనే ఉరవకొండ పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

నీట్ స్కాంలపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-అనంతపురం

నీట్-2024 స్కాంలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పిడిఎస్ఒ), నవ యువ సమాఖ్య(ఎన్‌వైఎస్) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పిడిఎస్ఒ జిల్లా కన్వీనర్ సాకే అశోక్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్, నెట్ పరీక్ష రాసిన విద్యార్థులకు సత్వరం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ జిల్లా కన్వీనర్ సాయి చరణ్, పిడిఎస్ఒ జిల్లా కో కన్వీనర్ సంజీవ్ రాజు, ఎస్‌కెయు కన్వీనర్ నవీన్, కమిటీ సభ్యులు అశ్రఫ్‌అలి, అభి, క్రిష్టిబాబు, ఎన్‌వైఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

రేపు పామిడి పంచాయతీలో వేలం

పామిడి : 2024 జులై 1 నుంచి 2025 మార్చి 31 వరకూ పామిడి పంచాయతీలో సుంకం వసూలు చేసుకునే హక్కు పొందడానికి ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు గ్రామపంచా యతీ కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాలకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు దినసరి మార్కెట్, బస్టాండ్‌కు రూ. 50వేల చొప్పున, జంతు వధశాలకు రూ. 20వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

2న గూగూడులో తలనీలాల కోసం..

నార్పల : మండలంలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించే తలనీలాల ను పోగు చేసుకునే హక్కుతో పాటు, ఆలయంలో పోగు చేసిన దాదాపు 3 వేల కిలోల చక్కెరకు జులై 2వ తేదీ ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.శోభ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు రూ. లక్ష ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు అనూహ్య స్పందన

కళ్యాణదుర్గం : ఎమ్మెల్యే సురేంద్రబాబు సహాయ సహకారాలతో నిర్వహించనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. గురువారం వరకూ వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థుల జాబితాను ఖరారు చేసిన వెంటనే కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

పుట్లూరు : ఈ నెల 19వ తేదీ కోమటికుంట్ల గ్రామంలో జరిగిన వైసిపి, టిడిపి నాయకుల ఘర్షణలో ఎరుకలయ్య(55) తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎరుకలయ్య గురువారం మృతి చెందాడు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఉద్యోగ విరమణ చేయనున్న ప్రధానోపాధ్యాయులు ఎస్ఆర్.ఆదినారాయణను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో చదివే బాలికలు జాతీయస్థాయిలో ప్రతిభా పాటవాలు కనబరిచి ప్రోత్సాహకాలు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇందులో విద్యార్థుల శ్రమతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల కృషి ఎంతైనా ఉందన్నారు. విద్యాశాఖలో 40 ఏళ్ల పాటు వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం పట్ల ఆదినారాయణను అభినందించారు. ఉపాధ్యాయ వృత్తి జీవితాలను బాగు చేసే పవిత్రమైన వృత్తిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ఆదినారాయణ, ఉపాధ్యాయులు, కౌన్సిలర్ జ్యోతి, మాజీ సభ్యులు పురుషోత్తం, టిడిపి నాయకులు శంకర్, తిప్పేస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న 17 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని భారత చైతన్య యువజన పార్టీ నాయకులు, రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు విజ్ఞప్తి చేశారు. 650 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 17 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం విచారకరం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, లేనిచో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయులను నియమించాలని ప్రతాపరెడ్డి ఎమ్మెల్యేని కోరారు.